


# మూలం

స్వర్ణలత ఇంటి పెరట్లో అటూఇటూ చిరాగ్గా తిరుగుతోంది. స్నానం చేసి అరగంటయినా కాలేదు. ఒళ్ళంతా చిటపట లాడుతోంది. ఎదురుగా ఉన్న సన్నజాజుల్ని చూసింది. సన్న జాజులు తెల్లగా పాలిపోయినట్టు కనిపించాయి. వాటి సువాసన ఆమెకు వికారంగా అనిపించింది. విసుగ్గా నాలుగడుగులు ముందుకేసి, ఆకాశం వంక చూసింది. ఆకాశం ఎ్రరగా దుమ్ముకొట్టుకుపోయినట్టు అసహ్యంగా కనిపించింది.

"ఆయనలో ఈ మధ్య బాగా మార్పొచ్చింది" అనుకుంది స్వర్ణలత.

"ఎందుకో అర్థం కావడం లేదు" అనుకుంది ఆ వెంటనే.

అలా తనలో తను అనుకుంటూనే పెరట్లోంచి ఇంట్లోకెళ్లి టేప్ రికార్డర్ ఆన్ చేసింది.

'సడి సేయకే గాలి......" స్వర్ణలతకాపాట కర్ణకఠోరంగా వినిపించింది.

"ఈ పట్నం వచ్చాకే ఆయనిలా మారిపోయారు. ఇంటి కొచ్చేటప్పటికే ముఖం ముడుచుకుని వస్తున్నారు. ఒక సరదా లేదు. నిన్నటికి నిన్న...."

ఆమెకదంతా ఇప్పుడే జరుగుతున్నట్టుగా వుంది.

జగన్నాథం స్కూటర్ చప్పుడు వినగానే స్వర్ణలత గబగబా వెళ్ళి గేటు తీసింది. అతను స్కూటర్ స్టాండ్ వేసి, ఇంట్లోకెళ్ళిపోయాడు. స్వర్ణలతకు మనస్సు చివుక్కుమంది. అయినా సర్దుకుని, ఇంట్లోకెళ్ళింది. అప్పటికే జగన్నాథం స్నానాల గదిలో ఉన్నాడు.

స్వర్ణలత పడకగదిలోకి నడిచి, ఫ్యాన్ వేసి, మంచం మీద కూర్చుంది. కొంత సేపటికి జగన్నాథం స్నానంచేసి వచ్చాడు. స్వర్ణలత చిర్నవ్వుతో అతన్ని చూసింది. అతను పట్టించుకోలేదు. ఆమె ఉసూరంటూ వంట గదిలోకెళ్ళి, కాఫీ పట్టుకొచ్చి జగన్నాథానికిచ్చింది.

ఎవరో తరుముకొస్తున్నట్టు గబగబా కాపీ తాగేసి, స్కూటర్‌మీద వెళ్ళిపోయాడు జగన్నాథం.

స్వర్ణలతకు కోపం వచ్చింది. అయినా, ఏం చెయ్యడానికీ పాలుపోలేదు. నీరసంగా మంచం మీద వాలిపోయింది. కళ్ళు మూసుకుంది. చీకటి, నల్లగా చిక్కగా. కాసేపటికి సన్నగా నల్లగీత పాములా వంకర్లు తిరుగుతూ. స్వర్ణలత గబుక్కున కళ్ళు తెరిచింది. ఒళ్ళు జలదరించింది.

వీక్లీ తీసుకుని ఆ వారం సీరియల్ చదవడం మొదలు పెట్టింది. చదువుతూ చదువుతూ పేజీ తిప్పి "ఏం చదివేనబ్బా" అనుకుంది. గుర్తు రాలేదు. ఒక్క అక్షరం కూడా బుర్రకెక్కలేదు. స్వర్ణలత మళ్ళీ సీరియల్ మొదటి పేజీ తీసి, చదవబోయి, పుస్తకం మూసేసింది. మంచం మీంచి లేచి టి.వి. ఆన్ చేసింది. ఏదో కార్యక్రమం వస్తోంది.

"ఆయన క్లబ్బుకే వెళ్లుంటారు. పేకాడుతూ ఉండి ఉంటారు. ఏ వేళకొస్తారో తెలీదు. తనకంటే ఆయనకవే ఎక్కువయ్యాయి" అనుకుంది.

టి.వి.లో ఆ కార్యక్రమం ముగిసింది. అనౌన్సర్ తెరమీదకు నిండుగా వచ్చి "రేపటి కార్యక్రమాలు" చెప్పడం మొదలుపెట్టింది.

"జాతీయ కార్యక్రమాలు, ప్రాంతీయ కార్యక్రమాలు, ప్రాయోజిత కార్యక్రమం.. ఇవేగా ఎప్పుడు చెప్పినా" అనుకుంటూ స్వర్ణలత టి.వి కట్టేసి వంట గదిలోకెళ్లింది.

"ఆకలిగా లేదు. అయినా తప్పదు కదా" అనుకుని నెమ్మదిగా భోజనం చేసింది.

పడగ్గదిలో కెళ్ళి, మళ్ళీ టి.వి. పెట్టింది. ఏదో హిందీ సీరియల్, భాష అర్థం కాదు. ఎలాగోలా కాలం గడపాలి. అందుకేదో ఒకటి చూడాలి.

"ఈ అమ్మాయిని ఏదో సినిమాలో చూసినట్టుందే. ఎందులో? పేరేమిటి?" ఎంతగా ఆలోచించినా స్వర్ణలతకు జ్ఞాపకం రాలేదు.

"ఏ పేరయితే ఏంలే" అనుకుంది చివరికి.

టివిలో ఇంగ్లీషు వార్తలు మొదలైనాయి. స్వర్ణలత టివి. కట్టేసి లైటార్పి పడుకుంది. నిద్రరావడం లేదు. అటూఇటూ దొర్లింది. కొంతసేపటికి నిద్రలోకి జారుకుంది.

"ఎంత సేపు బెల్ కొట్టినా తలుపు తీయవేం? పది గంటలకే నిద్రా? నిద్ర మొద్దు దొరికింది" అని విసుక్కుంటూ జగన్నాథం లోపలికి వచ్చాడు.

ఆమె అతని ముఖంలోకోసారి చూసి, తలుపేసి, డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చుంది. ఆవులిస్తూ, నిద్రనాపుకుంటూ ఎదురు చూస్తోంది.

జగన్నాథం స్నానంచేసి, వచ్చి కూర్చున్నాడు.

స్వర్ణలత కంచంలో అన్నం, కూరా వడ్డించింది.

"ఆవకాయ వేయనా" అడిగింది.

అతను కూర కలుపుకుంటూ మాట్లాడలేదు. ముద్ద నోట్లో పెట్టుకుని "ఏమిటీ కూర? రుచీపచీ లేదు. మొగుడికి వంట చేసి పెట్టడం కూడా చేతకాదు. టీ.వీలూ, పుస్తకాలూ తప్ప ఇంకేం అక్కరలేదు. ఏడ్రాసి మొహం వేసుకుని, ఇంకా అలా కూర్చున్నావేం. పెరుగు తీసుకురా" అన్నాడు.

"కూర బాగానే వుందే" అనబోయి, మౌనంగా ఫ్రిజ్‌లోంచి పెరుగు గిన్నె తెచ్చి అతని కంచంలో వేసింది.

భోజనం ముగించి, పడగ్గదిలోకెళ్ళిపోయాడు జగన్నాథం.

చాలాసేపు కుర్చీలో అలానే ఉండిపోయింది స్వర్ణలత. కళ్లల్లో నీళ్ళు తిరిగాయి. నిద్ర ఎగిరిపోయింది.

కంచం తీసి గిన్నెలు సర్ది పడగ్గదిలోకొచ్చింది. జగన్నాథం మంచానికి అటువైపు పడుకొని వున్నాడు. స్వర్ణలత ఇటువైపు చివర నడుం వాల్చింది. జగన్నాథం ఆమె దగ్గరకు జరిగి, నడుం మీద చెయ్యేసి తన వైపుకు లాక్కున్నాడు.

"వద్దు, వద్దొద్దు" అంది కంగారుగా.

"ఎందుకొద్దూ, ఏం కష్టపడిపోయావనీ" అంటూ జాకెట్టు మీద చెయ్యేశాడు.

"నా మనసేం బాగోలేదు"

"ఇంట్లో కూచుని తింటూ ఒళ్ళు బలిసిందేం" అంటూ ఆమెను చుట్టుముట్టేశాడు.

ఆమెకి కన్నీళ్ళొచ్చేశాయి. అతని మాటల్లో, చేష్టల్లో ఇంతకు- ముందు లేని మొరటుదనం, ఎందుకిలా జరుగుతోంది. ఈ పట్నం రాకముందు ఆయన ఎంత సున్నితంగా ప్రవర్తించేవారు? ఇక్కడికొచ్చేకే ఇలా.... అనుకుంటూ ఆమె మౌనంగా రోదించింది.

స్వర్ణలత పచార్లు చేస్తూ తల విదిలించింది. పెరట్లో మూల వున్న గులాబీ మొక్క వంక చూసింది. ఒకే వువ్వు వూసింది. అలా నడుస్తూ ఇంటి గేటు దగ్గర ఆగింది. నీలమ్మ గుడిసె కనిపించింది. అప్పుడు గుర్తొచ్చింది. నీలమ్మ ఇవేళింకా పనిలోకి రాలేదని.

"పొద్దుటా రాలేదు, సాయంత్రం రాకపోతుందా అనుకున్నాను. రాత్రివీ, పొద్దుటవీ చాలా గిన్నెలున్నాయి కడగాల్సినవి. పోనీ, వెళ్ళి పిలిస్తేనో' అనుకుంది.

అనుకున్నదే తడవుగా గేటు తీసుకుని మెట్లు దిగి రెండడుగులు వేసింది. కొంచెం దూరంలో ఇటే వస్తున్న నీలమ్మ కనిపించింది.

స్వర్ణలత వెనుతిరిగింది. వంట గదిలోకెళ్ళి అంట్ల గిన్నెలన్నీ బయట పడేసింది. నీలమ్మ వాటిని కడుగుతోంది నెమ్మదిగా.

‘ఏవే, పొద్దుట రాలేదు”.

‘ఏముందమ్మా ఎప్పుడూ ఉండేదే”

“మళ్లీ రాత్రి నీ మొగుడు తాగొచ్చి కొట్టేడా”.

“అవునమ్మగోరూ, ఎదవసచ్చినోడు, ఒళ్ళంతా కుల్లపొడిసేసేడు. పొద్దున్న కూడా కొట్టేడమ్మా”.

“తాగుడూ, కొట్టడమూ లేదుకానీ, మా ఎదవ సచ్చినోడూ....” అనుకుంటూ.

“ఏవిటీ! పొద్దుట కూడానా” అంది స్వర్ణలత.

“ఏం సెప్పమంటారమ్మా మా పుట్టింటోల్లు నా మనువప్పుడు ఎండి కడియాలెట్టారండి. అవిచ్చేమంటాడు. నేనియ్యనంటాను. ఆకరికి నన్ను సితగ్గొట్టి అట్టుకుపోయేడమ్మా?”

“అయ్యయ్యో అవమ్మేసి తాగేస్తాడా?”

“యాపారం సేస్తాడంట”

“ఏం వ్యాపారం”

“మన జంచన్లో కిల్లీ బడ్డీ ఎడతాడంట”.

“ఏం పెడతాడ్లే వాడి మొహం అనబోయి, “పెడితే మంచిదేలే” అంది స్వర్ణలత.

“ఏమోనమ్మా ఏం సేస్తాడో ఏంటో” అంది నీలమ్మ దిగులుగా.

స్వర్ణలత ఆలోచిస్తూ కూర్చుంది. నీలమ్మా దాని మొగుడూ గట్టిగా బూతులు తిట్టుకుంటూ అరుచుకోవడం. వాడు దభీ దభీమని దాన్ని కొట్టడం తరచూ తనకు వినిపిస్తూనే ఉంటాయి. అలగా జనం అంతేలేనని తను చాలా సార్లు అనుకుంది. అంతగా కాకున్నా ఈ మధ్య ఆయనా అలాగే ప్రవర్తిస్తున్నారు మొరటుగా. ఇంతకు ముందు పల్లెటూర్లో ఉన్నప్పుడు ఎంత మృదువుగా ప్రవర్తించేవారు!

❀❀❀

పచ్చని పొలాలు పండు ముత్తయిదువుల్లా వున్నాయి. వాటిమధ్య ఉన్న ఆ వూరు పచ్చని చీర కట్టుకున్న పరువాల వయ్యారిలా వుంది. ఆ వూర్లోని జనం అంతా పచ్చపచ్చగా పచ్చపచ్చగా లేరు. తక్కువ మంది ఊట బావుల్లా, ఎక్కువమంది ఎండిన బీడుల్లా వున్నారు.

ఓ ఊట బావి దగ్గర జగన్నాధం ఇల్లు. స్వర్ణలత అప్పుడే స్నానం చేసి, వాయిల్ చీర కట్టుకుని శుభ్రంగా తయారయ్యింది. జగన్నాధం పొలం నుంచి వచ్చి వాకిట్లో మంచం మీద కూర్చుని ఏదో పుస్తకం చదువుతూ మెరిసిపోతున్న స్వర్ణలతను చూశాడు.

"ఈ మెరుపులు ఎక్కడివో లతమ్మ గారి మోములో" అంటూ పాడాడు కన్ను గీటుతూ.

"అవన్నీ నీ కోసం విరిసిన ఎదురు చూపులే" అంది తనూ తక్కువేం కానట్టు.

"మల్లె వూపులా తయారయ్యావు ఎవరి కోసమో"

"చెప్పుకోండి చూద్దాం"

"నా కోసమో, ఇంకెవరి కోసమో"

"ఛీ! అలాంటి మాటలు సరదాక్కూడా అనొద్దు. నా కిష్టం వుండదు. మీరూ స్నానం చేసిరండి".

"ఎవరి కోసం"!

"మీరే చెప్పండి"

"నీ కోసం కాదు".

"మరెవరి కోసం?"

"నా కోసం"

"స్వార్థమే అనర్థ కారణం"

"అది చంపుకొనుట క్షేమదాయకం"

"మీలాంటి వాళ్ళకంతే లెండి" అంది స్వర్ణలత బుంగమూతి పెడుతూ.

'అలిగిన వేళనే చూడాలి"

"నే నేం పొంగిపోను".

"ఈ ప్రపంచమే అలా ఉంది. నిజం చెప్పినా నమ్మరు" అన్నాడు జగన్నాధం నిట్టూర్చినట్టు అభినయిస్తూ.

స్వర్ణలత వచ్చే నవ్వును ఆపుకుంటూ, పుస్తకంలోని పేజీ మీద దృష్టి పెట్టింది.

"స్నానానికెళ్తున్నాను"

"..."

"వీపు రుద్దనా అని అడగొచ్చు కదా ఇంచక్కా"

"నాకు సిగ్గు బాబూ. అత్తయ్య నూతి దగ్గరే ఉన్నారు కూడా".

"అమ్మ అక్కడ లేకపోతే రుద్దుతావన్నమాట".

"......"

"మాట్లాడవేం"

"అత్తయ్యక్కడ ఉన్నారన్నానా?"

"ఏదో చెప్పి పంపించేస్తాను".

"మళ్ళీ రావచ్చు కదా!"

"హు! నీకు నా మీద ప్రేమ లేదు"

"వీపు రుద్దితేనే ఉన్నట్టా?"

అవునన్నట్లు తలూపాడు జగన్నాధం.

"నాకా రుద్దుడు ప్రేమలొద్దు లెండి".

"హృదయం లేని ప్రియురాలా...."

"ఆ పాట పాడుకుంటూ స్నానం చేసెయ్యండి"

"ఆ పాట నా వీపు రుద్దదు కదా?"

"పోనీ, రుద్దవే నా వీపు రుద్దవే అనుకుంటూ పాడుకోండి"

"అంతేనంటావా?"

"ఇప్పటికంతే?"

"ఎంత దయలేనివారు ఈ ఆడవారు!"

"ఎంత జగమొండి వాళ్ళీ మగవాళ్ళు!"

"మాటకి మా....."

"కాదు పాటకి పాట"

జగన్నాధం ఏదో అనబోతోంటే–

"జగ్గూ ఎంత సేపయిందిరా పొలం నుంచొచ్చి" అన్న తల్లి మాట విని వెనక్కి చూశాడు.

స్వర్ణలత లేచి నిలబడింది.

"బేగా స్నానం చేసిరా. బాగా పొద్దు పోయింది. అన్నం చల్లారిపోతోంది".

తల్లి మాటతో స్నానానికెళ్తూ స్వర్ణలత వంక చూశాడు జగన్నాధం. ఆమె కూడా నవ్వాపుకుంటూ అతన్ని క్రీగంట చూసింది. "నీ పని చెబుతానుండు" అన్నట్టు సైగ చేసి నూతి దగ్గరకెళ్ళిపోయాడు. స్వర్ణలత అత్తగారి వెంట వంట గదిలోకి నడిచింది.

జగన్నాధం స్నానంచేసి లుంగీ కట్టుకుని వచ్చి, కంచం ముందు పీటమీద కూర్చుని–

"అమ్మా, నువ్వూ స్వర్ణా కూడా భోం చేసెయ్యరాదూ" అన్నాడు.

"నేను తర్వాత చేస్తాలేరా. స్వర్ణా! నీక్కూడా వడ్డించనా".

"వద్దత్తయ్యా మనిద్దరం తర్వాత తిందాం" అంది స్వర్ణలత.

జగన్నాథం స్వర్ణలత వంక కోపంగా చూశాడు. స్వర్ణలత అతని వంక చిర్నవ్వుతో చూసింది.

అతను భోంచేసి, పడగ్గదిలోకెళ్ళిపోయాడు. అత్తగారితో పంక్తికి కూచుని, ఓ అరగంటయ్యాక స్వర్ణలత అతని దగ్గరకెళ్ళింది.

జగన్నాథం ఏదో నవల చదువుతూ, స్వర్ణలత వచ్చిన అలికిడి విన్నా కావాలనే అటు చూడకుండా ఉండిపోయాడు. స్వర్ణలత చిన్నగా సకిలించింది. జగన్నాథం పుస్తకంలోంచి తలెత్తలేదు.

"ఏంటి బాబూ! మరీ సీరియస్‌గా చదివేస్తున్నారు?" అంది.

అతను మాట్లాడలేదు.

"మిమ్మల్లే" అంటూ పుస్తకం లాక్కుంది.

"నా మాటకసలు విలువ లేకుండా పోతోంది"

"ఎప్పుడు మీ మాట కాదన్నాను"

"చేసేదంతా చేసేసి ఎంత నంగనాచిలా మాట్లాడుతుందో".

"నేనేం చేశాను"

"వీపు రుద్దమంటే రుద్దలేదు. నాతో కలిసి భోంచెయ్యమంటే చెయ్యలేదు".

"ఓస్, అదా" అంది నవ్వేస్తూ.

"నీ కంతా వేళాకోళంగా ఉంది"

"అది కాదండి. మీ అమ్మగారికి కంపెనీ ఇస్తే మీకానందం కదా".

"మరి వీపో"

"పోనీ, ఇప్పుడు గోకనా"

"ప్రతి దానికీ ఏదో ఒకటి అంటావు. నేను నీతో మాటాడను పో".

"నేను పోనుగాకపోను. మీరు మాటడకపోతే నేనే మాటాడతాను" అంటూ వెనక నుంచి అతని భుజాల మీద చేతులేసి, అతని మెడ దగ్గర తన తల వాల్చింది స్వర్ణలత.

తర్వాత వాళ్ళు మాట్లాడుకోలేదు. వాళ్ళ హృదయాలే మాట్లాడుకున్నాయి.

❀❀❀

ఆ సంఘటన తలచుకోగానే స్వర్ణలత ముఖం వెలిగిపోయింది.

"ఆ పల్లెటూర్లో ఉన్నప్పుడు దాదాపు రోజూ అలాగే వేళాకోళాలాడుకుంటూ, కవ్వించుకుంటూ, నవ్వుకుంటూ, అలకలు తీర్చుకుంటూ ఎంతో హాయిగా కాలం గడిచిపోయేది. ఆ బంగారు రోజులేవీ? ఈ పట్నం రావటం వల్లే కదా ఇలా గయింది?" అనుకుంటూ ఆమె నిట్టూర్చింది.

"ఎల్లొత్తానమ్మా" అంది నీలమ్మ చేతులు పమిట కొంగుకు తుడుచుకుంటూ.

"ఉండు కూర ఇస్తాను" అని స్వర్ణలత లోపలికెళ్ళి గిన్నెలో పెట్టి ఇచ్చింది.

నీలమ్మ ముఖం ఇంత చేసుకుని, దాన్ని పట్టుకుని వెళ్ళిపోయింది.

మర్నాడు కూడా నీలమ్మ ఆలస్యంగా వచ్చింది.

"ఇలా గయితే ఎలాగే? ఇల్లంతా నేనే తుడిచేసుకున్నాను" అంది స్వర్ణలత కొంచెం కోపంగా.

"రేపట్నుంచి ఆలీసెం సెయ్యనమ్మగోరూ! మావోడు నిజంగానే కిల్లీకొట్టు యెట్టేడండి. పాతది అమ్మకానికొస్తే కొన్నాడండి. అందులో సోడాలు, డింకులు, కిల్లీ సామాను డబ్బాలూ, సిగరెట్టు పెట్టెలూ అవీ సర్దేటప్పటికి ఆలిసమయి పోయిందండి" అంది నీలమ్మ నెమ్మదిగా.

"సర్లే" అనేసింది స్వర్ణలత.

ఆ మర్నాడు

"అమ్మగోరూ! కిల్లీ కొట్టంటే ఏటోననుకున్నానండి. మొదటి రోజే ఏభై రూపాయల నాబం వచ్చిందని సెప్పేడండి.ముందు ముందు ఇంకా బాగా నాబాలొత్తాయంటండి" అంది నీలమ్మ సంతోషంగా.

"పోన్లేవే, మీ కింక డబ్బుకిబ్బందుండదు" అంది స్వర్ణలత.

నీలమ్మ రోజూ తమ కిళ్ళీ బడ్డీ గురించి ఏదో ఒకటి చెబుతూనే వుంది.

స్వర్ణలతకు భారంగా మరో నెల రోజులు గడిచాయి.

ఒకనాడు పొద్దుటే తయారై–

"మనూరెల్లి వస్తాను. రాత్రప్పుడు తలుపులు జాగ్రత్తగా వేసుకో. నేను వచ్చేటప్పటికి రెండు రోజులు పట్టొచ్చు" అన్నాడు జగన్నాథం సూటుకేసులో బట్టలు సర్దుకుంటూ.

"నేనూ వస్తానండి మీతో" అంది స్వర్ణలత.

"తోకలా ప్రతిదానికీ సిద్ధమే. దేభ్యం మొహం వేసుకుని" అంటూ జగన్నాథం వెళ్ళిపోయాడు.

స్వర్ణలతకు ఏడుపొచ్చేసింది.

"ఎన్నాళ్లిలా" అనుకుంది.

ఆ రోజు సాయంత్రం నీలమ్మ కూనిరాగం తీసుకుంటూ వచ్చింది.

"అమ్మగోరూ గిన్నెలు బేగా వెయ్యండి" అంది నీలమ్మ.

"ఏమిటే అంత కంగారు, సినిమాకింకా టైముందిలే" అంది స్వర్ణలత ఆ రోజు ఆదివారం అని గుర్తొచ్చి.

"అది కాదండమ్మగోరూ. మా ఆయన గోరు టి.వి. కొన్నాడండి. మా సుట్టుపక్కలోళ్లు సూద్దానికొత్తారండి" అంది నీలమ్మ మహదానందంగా.

స్వర్ణలత ఆశ్చర్యపోయింది.

"అంత డబ్బెక్కడిదే" అంది అనాలోచితంగా.

"ముందుగా రెండేలు కట్టేడండి. నెలనెలా కొంత కడ్తాడటండీ" అని, మళ్లీ తను మామూలుగానే మాట్లాడుతున్నట్టు గమనించి నాలుక్కరుచుకుంది నీలమ్మ.

"బావుంది" అన్నట్టు స్వర్ణలత తలూపి ఊరుకుంది.

"అమ్మగోరూ! మా ఆయనగోరు ఇంగిలీసు ముక్కలు నేర్చుకుంటున్నారండి. నా కవొద్దుగానీ, కాసింత మంచి బాస నేర్పాలండి".

"నేనేం నేర్పగలనే".

"నా యాస బాస మార్చాలండి. ఇలాగనగూడదే, అలాగనాలే అని చెప్పాలండి"

"అలాగేలే" అంది స్వర్ణలత నవ్వేస్తూ.

నీలమ్మ పనిలో పడింది.

'ఏవే, నీ మొగుడింకా తాగొచ్చి రోజూ కొడుతున్నాడా".

"ఇప్పుడాయనగోరు శానా మారిపోయేరండి. మునపటిలాగ పీకల్దాకా తాగడం నేదండి. ఇంట్లోనే కాసింత తాగేసి, వన్నం తినేసి, నాతో ఆ కబురూ ఈ కబురూ చెప్పి బుద్దిగా తొంగుంటున్నాడండి" అంది నీలమ్మ గొప్పగా.

మళ్ళీ ఏదో గుర్తొచ్చినట్టు–

"మీకు సెప్పడం మర్చిపోయేనమ్మగోరూ, నన్ను పాసిపన్లు సెయ్యొద్దన్నారండి మా ఆయన గోరు. మిగతాయన్నీ మానేసి, మీకొక్కరికే సేస్తన్నానండి" అంది నీలమ్మ.

"మరి మా ఇంట్లో ఎందుకు మానలేదే" అడిగింది స్వర్ణలత.

"అమ్మగోరూ! నా కట్ట సుకాలన్నీ మీతోనే సెప్పుకున్నాను. తల్లిలా ఇసుక్కోకుండా ఇన్నారు. ఇప్పుడు నాలుగు డబ్బులున్నాయని మిమ్మల్నొదులుకోలేనమ్మగోరూ".

నీలమ్మ అభిమానం చూడగానే స్వర్ణలత కదిలిపోయింది. అభిమానంగా ఆమె భుజం తట్టింది.

ఆమె వెళ్ళిపోయాక స్వర్ణలత ఆలోచిస్తూ కూర్చుంది.

"నీలమ్మ బతుకు ఎంతలో మారిపోయింది. ఆ మార్పు దాని మొగుడి మార్పువల్లే కదా జరిగింది" అనుకుంది.

తర్వాత టి.వి.లో సినిమా చూస్తూ కూర్చుంది. మధ్యలో భర్త గురించి ఆలోచనలు ముసురుతుంటే, తల విదిల్చుకుంటూ సినిమా చూసింది.

తెల్లవారింది. స్వర్ణలత వంట పని ముగించుకుని స్నానాల గదిలోకెళ్లింది. కొద్ది సేపటికి కాలింగ్ బెల్ మోగింది. అప్పుడే ఒంటికి సబ్బు రాసుకుంటోంది.

"ఎవరొచ్చి ఉంటారు? ఆయన కానీ వచ్చేశారా?" అనుకుంటూ త్వరత్వరగా స్నానం చేసి, అదే చీర చుట్టబెట్టుకుంది.

"ఆయనే అయితే, ఆలస్యంగా తలపు తీసేనని ఇప్పుడేమి కస్సుమంటారో" అనుకుంటూ కిటికీలోంచి జగన్నాథాన్ని చూసి తలుపుతీసింది.

అతను లోపలికొచ్చాడు.

"స్నానం చేస్తున్నాను. అందుకని ఆలస్యమైంది".

"నేనీవేళే వస్తానని నువ్వేమన్నా కలగన్నావా?" అన్నాడు జగన్నాథం చిర్నవ్వుతో.

స్వర్ణలత అయోమయంగా చూసింది.

జగన్నాథం గబగబా తయారయి.....

"స్వర్ణా! మన కష్టాలు తీరిపోతున్నాయి. మన కంపెనీకి అదనంగా పెట్టుబడి కావాల్సి వచ్చి కొంత కాలంగా ఎన్నో ప్రయత్నాలు చేశాను. పెద్దపెద్ద ఆర్డర్లున్నా పెట్టుబడి లేక ఏం చెయ్యలేక పోయాను. ఇప్పుడు డబ్బు సమకూరింది. ఇక ఏ ఇబ్బందీ వుండదు. సాయంత్రం సిద్ధంగా వుండు. సినిమా కెళ్దాం" అని సున్నితంగా ఆమె బుగ్గగిల్లి బయటకెళ్లిపోయాడు.

స్వర్ణలత కొన్ని క్షణాలు నమ్మలేనట్లుగా అలానే నిలబడిపోయింది.

కిటికీలోంచి పెరట్లోకి చూసింది. సన్నజాజులు తెల్లగా హాయిగా కనిపించాయి. వాటి సువాసన మనసును మైమరపించింది. ఆకాశం నిర్మలంగా నీలంగా మనోహరంగా ఉంది. జంట గులాబీలు తను కోరుకుంటున్న బిడ్డ బుగ్గల్లా ఉన్నాయి.

నీలమ్మ దాని మొగుడు లాంటి వాళ్లూ, తన భర్తలాంటి వాళ్ళూ అప్పుడలాగ, ఇప్పుడిలాగ ఉండడానికి ఇన్నాళ్లూ తననుకుంటున్నట్లు పల్లె, పట్నమూ కారణం కాదని ఆమెకు తెలిసింది. అసలు విషయమూ బోధపడింది.

*మార్చి 9-15, 1994, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక*